
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా

జిల్లా వార్తలు

బుధవారం 21 ఆగస్టు 2024



అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్ని రకాలుగా సంపాదించవచ్చో అనడానికి నిలువెత్తు నిదర్శనం వైసీపీ నాయకుడు, మాజీమంత్రి జోగి రమేశ్. ఇప్పటికే సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అడ్డంగా దొరికిపోయిన జోగి కుటుంబం.. తాజాగా పెడన మండలంలో వందలాది మంది చిన్న రైతుల పొట్టకొట్టి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. అధికారం దూరం కావడంతో అక్రమార్జనే ధ్యేయంగా ఆయన చేసిన అవినీతి బాగోతాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తామే అధికారంలోకి వస్తామన్న ధీమాతో లెక్కకుమించిన తప్పులు చేసుకుంటూ పోయిన జోగి కుటుంబం ఇప్పుడు ఊచలు లెక్కపెట్టే పరిస్థితికి చేరింది.

గరిశపూడి, నిడమర్రు గ్రామాల వద్ద జోగి రమేశ్ సబ్‌లీజుకు ఇచ్చిన చెరువులు ఇవే..



గలీజు జోగి

వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ మరో కుంభకోణం

- కృత్తివెన్ను మండలంలో ఆయన మార్కు దోపిడీ
- దాదాపు 300 ఎకరాల చెరువుల్లో అడ్డగోలు అవినీతి
- చిన్నరైతుల చెరువులు తక్కువకు లీజుకు తీసుకుని..
- బడాబాబులకు ఎక్కువకు సబ్‌లీజుకు ఇచ్చి..
- ఏటా రూ.2 కోట్ల పైచిలుకు ఆదాయం హాంఫట్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/కృత్తివెన్ను) : అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి జోగి రమేశ్ పెడన నియోజకవర్గంలో తన అనుచరుల ద్వారా చేసిన అవినీతి పనులన్నీ బయటకు వస్తున్నాయి. చేపల చెరువుల తవ్వకాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, పాస్ పుస్తకాల పంపిణీ.. ఇలా అన్నింటిలోనూ తన అనుచరుల ద్వారా వసూళ్ల దందా సాగించిన జోగి సొంత పార్టీ నేతలనూ వదల్లేదన్న విమర్శలున్నాయి. కానీ, తాజాగా వెలుగులోకి వచ్చిన ఉదంతం మాత్రం వసూళ్ల దందాలో జోగిలోని కొత్తకోణాన్ని తెలియజేస్తుంది. కేవలం మాట అడ్డంపెట్టి చిన్న, సన్నకారు రైతులకు దక్కాల్సిన కోట్లాది రూపాయలు జేబులో వేసుకున్న తీరును చూసి 'అమ్మ జోగి' అంటూ సొంత పార్టీ నేతలే ముక్కున వేలేసుకుంటున్నారు.

చిన్న చెరువులపై పెద్ద కన్ను

కృత్తివెన్ను మండలం గరిశపూడి, నిడమర్రు రెవెన్యూ గ్రామాల పరిధిలో తణేలు వంతెన సమీపంలోని ఆర్ఎస్ నెంబరు 66, 75, 76, 77లో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో చిన్నచిన్న చెరువులు ఉన్నాయి. వీటిలో అత్యధికం ప్రభుత్వ భూములు కాగా, అవి స్థానికుల ఆక్రమణలో ఉండేవి. కొంతమేర పట్టా భూములు కూడా ఉన్నాయి. ఈ భూములన్నింటినీ స్థానికులు వాటాలుగా పంచుకుని పీతలు, రొయ్యల చెరువులుగా సాగు చేసుకుంటున్నారు. ఈ విధానం కొన్నేళ్లుగా అమల్లో ఉంది. పెదలంక డ్రెయిన్‌ను ఆనుకుని ఉండటంతో ఆటుపోట్లకు ముంపునకు గురయ్యే ఈ భూముల నుంచి అంతంతమాత్రంగానే ఆదాయం ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెడన ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జోగి రమేశ్ కన్ను ఈ భూములపై పడింది. మంత్రి అయ్యే వరకు ఓపిక పట్టిన ఆయన ఆ తర్వాత వాటిని చెరబట్టాడు. ఆదాయం రాని ఆ భూములను తనకు ఏడేళ్ల పాటు అగ్రిమెంటు రాసి, లీజుకు ఇవ్వాలని రైతులను జోగి రమేశ్ కోరారు. లీజు పూర్తయ్యేలోపు భూములకు పట్టాలు ఇప్పిస్తానని ఆశ చూపారు. దీంతో చిన్న సన్నకారు రైతులంతా పట్టాల కోసం ఆశపడి, తమ భూములను సంవత్సరానికి ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు లీజుకు ఇచ్చారు. ఇవ్వని వారిని భయ పెట్టి, బెదిరించి మరీ భూములను లీజుకు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. లీజుకు తీసుకున్న భూముల్లో కొంతభాగం తక్షణమే గోదావరి జిల్లాకు చెందిన బడా రైతులకు సబ్ లీజుకు ఇచ్చేశారు. రైతుల నుంచి లీజుకు తీసుకున్న మొత్తానికి పది రెట్లు బడా రైతులకు సబ్‌లీజుకు ఇవ్వడం గమనార్హం. ఎకరా రూ.50 వేల

లీజు పేరిట రెట్టింపు దోపిడీ

నుంచి రూ.60 వేల వరకు లీజుకు ఇచ్చేశారు. అంటే మధ్యవర్తిగా మాట అడ్డంపెట్టి ఏడాదికి ఎకరం చెరువు ద్వారా రూ.50 వేల వరకు లబ్ధి పొందారన్న మాట. పైగా వాటిని పెద్దపెద్ద చెరువులుగా తవ్వేందుకు సదరు బడా రైతు నుంచే ఎకరాకు రూ.5 వేల చొప్పున ఖర్చుల నిమిత్తం పిండేయడం గమనార్హం. ఈ చెరువుల ద్వారా ఏటా మాజీమంత్రికి లీజు రూపంలో రూ.కోటిన్నర వరకు ఆదాయం వస్తుండటం గమనార్హం. పడతడిక, నిడమర్రు గ్రామాల పరిధిలో పోడు రోడ్డు నుంచి లక్ష్మీపురం సబ్ చానల్ వరకు మధ్యలో సుమారు 120 ఎకరాలను కూడా ఈ మాదిరిగానే రైతుల నుంచి తక్కువకు లీజుకు తీసుకుని, సబ్ లీజుకు ఇచ్చి ఏటా రూ.60 లక్షల వరకు జేబులో వేసుకుంటున్నారు.

రెవెన్యూ టూ సీఆర్‌డీఏ డిప్యుటేషన్లు

రెండు జిల్లాల్లో 8 మంది తహసీల్దార్లకు స్థానచలనం

- మరో నలుగురు డీటీలు కూడా..
- సీసీఎల్ఏ ఆదేశాలతో తహసీల్దార్లలో గందరగోళం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)లో రెవెన్యూ విభాగంలో పెద్దసంఖ్యలో డిప్యుటేషన్లకు రంగం సిద్ధమైంది. తొలిదశలో 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యుటేషన్ పద్ధతిలో పంపించగా, తాజాగా రెండు జిల్లాల పరిధిలో 8 మంది తహసీల్దార్లు, నలుగురు డిప్యూటీ తహసీల్దార్ల (డీటీలు)ను కేటాయించింది. ఈ విషయాన్ని వ్యక్తిగతంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు తెలియపరచటంతో పాటు సీఆర్‌డీఏకు కూడా వివరించింది. తహసీల్దార్ల స్థానాల్లోకి వచ్చి రెండు వారాలు కూడా గడవకముందే హఠాత్తుగా తమను సీఆర్‌డీఏకు పంపించడంతో తహసీల్దార్లంతా అవాక్కయ్యారు. ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించినా లాభం లేదనుకుని కలెక్టర్లపై ఆశ పెట్టుకున్నారు. ఈ ఆదేశాలను సీసీఎల్ఏ ఇంకా కలెక్టర్లకు పంపించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ల అభిప్రాయం కోసం పలువురు తహసీల్దార్లు చూస్తున్నారు.

కొరత తీరేనా..?

ఎవరెన్ని ఆశలు పెట్టుకున్నా ఎంపికైన వారు సీఆర్‌డీఏకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలను బలోపేతం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కచ్చితంగా ఆయా శాఖల నుంచి డిప్యుటేషన్లపై పంపించాల్సిన అవసరం ఉంది. అనుభవం కలిగిన వారినే సీఆర్‌డీఏకు పంపిస్తున్నారు. అయితే, దీనివల్ల రెండు జిల్లాల్లో స్థానికంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల కొరత ఏర్పడుతుంది. ఈ కొరతను తీర్చుకోవటానికి సీనియారిటీ కలిగిన డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ ఈ అంశంపై కోర్టులో వివాదం నడుస్తోంది. లేకపోతే అర్హులైన డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. రెండు జిల్లాల యంత్రాంగాలతో పాటు రెవెన్యూ ఉద్యోగుల సంఘాలు కూడా కోర్టు తగాదాలను పరిష్కరించుకోవటం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపించొచ్చు.

డిప్యుటేషన్లు పొందిన తహసీల్దార్లు, డీటీలు వీరే..

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ తహసీల్దార్ సీహెచ్ దుర్గాప్రసాద్, విజయవాడ తూర్పు తహసీల్దార్ ఆర్వీవీ రోహిణీదేవి, మైలవరం డీటీ ఎం.శ్రీహరి, విజయవాడ సెంట్రల్ డీటీ ఎన్.శ్రీనివాసమూర్తి, కృష్ణాజిల్లా నుంచి గన్నవరం తహసీల్దార్ కె.వెంకటశివయ్య, పెడన తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, కలెక్టరేట్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ పి.మధుసూదనరావు, చల్లపల్లి డీటీ ఎస్ఎస్ఎస్ కుమార్, కంకిపాడు డీటీ నాగరాజు డిప్యుటేషన్ పొందారు.



దుర్గగుడిలో ముగిసిన పవిత్రోత్సవాలు

6లో..



బొర్రపోతుపాలెం గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న గీతాబాయి

డెంగ్యూ ప్రబలకుండా పటిష్ట చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి గీతాబాయి

- బొర్రపోతుపాలెం గ్రామంలో పర్యటన

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 20 : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలు డెంగ్యూ బారిన పడకుండా, జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి.గీతాబాయి సూచించారు. బందరు మండలం బొర్రపోతుపాలెం గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యబృందం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న ఇంటింటికీ సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో జనవరి నుంచి 47 మంది డెంగ్యూ వ్యాధికి గురయ్యారన్నారు. ఇటీవల బందరు మండలం భోగిరెడ్డిపల్లి, బాపులపాడు మండలం వీరవల్లి, అంపాపురం, చల్లపల్లి మండలం పురిటిగడ్డలో మరో ఐదుగురు డెంగ్యూ వ్యాధికి గురయ్యారన్నారు. వీరికి సకాలంలో వైద్య సేవలు అందించడం వల్ల కోలుకోగలిగారన్నారు. జిల్లాలో 49 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 355 విలేజ్ క్లినిక్‌లలో కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మచిలీపట్నం, గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్లేట్‌లెట్లు పడిపోతే తక్షణ సేవలు అందిస్తున్నారన్నారు. బొర్రపోతుపాలెంలో 260 ఇళ్లు ఉన్నాయని, వీటిలో ఇప్పటికి 140 ఇళ్ల సర్వే పూర్తయిందని, మిగిలిన 120 ఇళ్ల సర్వే బుధవారానికి పూర్తవుతుందన్నారు. అన్ని గ్రామాల్లోనూ దోమల మందు పిచికారీ చేయడమే తక్షణ కర్తవ్యంగా పంచాయతీలు ఉండాలన్నారు. ప్రస్తుతం బొర్రపోతుపాలెం గ్రామ ప్రజలు కోలుకుంటున్నారని, అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు సుస్వర, గ్రామ కార్యదర్శి నరసింహారావు, సర్పంచ్ గట్టే సుశీలామణి, టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, కాగిత సాంబశివరావు పాల్గొన్నారు.

ఆ వీఆర్వోలు సెపరేటు..!



ఖరీదైన ఖద్దరు దుస్తులు వేసుకుంటారు కానీ, పేరొందిన రాజకీయ నాయకులు కాదు. జిగేలుమనే బంగారు ఆభరణాలతో మెరిసిపోతారు కానీ, బడా వ్యాపారవేత్తలు కాదు. అంతకుమించిన ఐ ఫోన్లు.. స్పోర్ట్స్ బైకులు ఉపయోగిస్తారు కానీ, సినిమా హీరోలు కూడా కాదు. విలాసవంతమైన భవనాలు.. ఆధునిక అపార్టుమెంట్లలో రాచభోగాలు అనుభవిస్తారు కానీ మాఫియా డాన్లు కూడా కాదు. వినడానికి విడ్డూరంగా ఉన్నా.. నమ్మడానికి కాస్త కష్టమైనా.. వీరంతా సాధారణ ప్రభుత్వ ఉద్యోగులైన వీఆర్వోలు. వీరి వేతనం నెలకు రూ.50 వేలే. వీరిని చూస్తే మాత్రం అస్సలు అలా కనిపించరు. విజయవాడ నగరం, విజయవాడ రూరల్ మండల పరిధిలో ఏళ్ల తరబడి తిష్టవేసి రెవెన్యూలో షాడో బాసులుగా చెలామణీ అవుతున్నారు. ప్రజలను జలగల మాదిరిగా పీల్చి పిప్పి చేస్తున్నారు. తహసీల్దార్లు, డీఆర్వోలు మొదలుకుని ఆర్‌డీవోల వరకూ, ఆఖరుకు ఏసీబీ అధికారులను సైతం బుట్టలో వేసుకుని పనులు చక్కబెడుతున్న 'ధనా'పాటీలు వీరు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో ఇక్కడి నుంచి కదలకుండా ఉండటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

విజయవాడ, విజయవాడ రూరల్ మండలాలను ఏలుతున్న 'ధనా'పాటీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 14 లక్షల జనాభా కలిగిన విజయవాడ నగరంలో నాలుగు రెవెన్యూ మండలాలున్నాయి. నగరాన్ని ఆనుకుని శరవేగంగా విస్తరిస్తున్న మండలం విజయవాడ రూరల్. ఈ ఐదు మండలాల పరిధిలో పనిచేస్తున్న విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల (వీఆర్వో) రూటే వేరు. దాదాపు డజను మంది వీఆర్వోలు 'షాడో' బాస్ అవతారమెత్తారు. ఖద్దరు దుస్తులతో రాజకీయ నాయకులను, సెలబ్రిటీలను తలపించేలా, బంగారు ఆభరణాలు, ఐఫోన్లతో కనిపించే ఈ షాడో బాస్‌లు సొంత వృత్తి కంటే వ్యాపారాలపైనే ఎక్కువ దృష్టి పెడతారు. తమ మండలాల పరిధిలో డాక్యుమెంట్ రైటర్ల అవతారమెత్తారు. సబ్ రిజిస్ట్రార్లతో సంబంధాలను కలిగి ఉండి భారీ ఎత్తున దండుకుంటున్నారు. వీఆర్వో ఉద్యోగాల కంటే డాక్యుమెంట్ రైటర్ల ఉద్యోగాలే ఎక్కువగా వెలగబెడుతున్నారు. అంతేకాదు.. రియల్టర్ల అవతారమెత్తి త్రిపాత్రాభినయం కూడా చేస్తున్నారు. వీఆర్వోలుగా తమకున్న అధికారాలను దుర్వినియోగపరిచే స్థాయికి దిగజారుతున్నారు. రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసే స్థాయికి వెళ్తున్నారు. తప్పుడు రిపోర్టులు ఇచ్చే స్థాయికి దిగజారుతున్నారు. మాజీమంత్రి జోగి రమేశ్ అగ్రిగోల్డ్ భూముల కబ్జా వ్యవహారంలో ఒక వీఆర్వో తప్పుడు ఎండార్స్‌మెంటే కీలకపాత్ర పోషించింది. వీరిలో చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయటం కోసం విజయవాడ బైపాస్ వెంబడి ఖరీదైన భూములు కొన్నారంటే ఏ స్థాయిలో చేతులు చాస్తున్నారో అర్థమవుతుంది.

తూతూమంత్రంగానే తహసీల్దార్లు

ఈ షాడోబాస్‌లు ఉన్న మండలాల్లో తహసీల్దార్ల పాత్రమీ ఉండదు. కొత్తగా వచ్చే తహసీల్దార్లకు స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవడంతో వీఆర్వోలపైనే ఆధారపడతారు. దీనిని ఆసరాగా చేసుకుని ఈ షాడోలు రూపాంతరం చెందుతున్నారు. తహసీల్దార్లకు తప్పుడు సమాచారాలు ఇవ్వటంతో పాటు డబ్బు ఆశచూపి వారిని లొంగదీసుకోవడం, ప్రతి పనికీ రేటు కట్టి తహసీల్దార్లకు ప్రయోజనం కల్పించడం చేస్తున్నారు. వీరిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు మాత్రం శూన్యం. రాజకీయ నేతల దృష్టికి తీసుకెళ్లినా అదే పరిస్థితి.

ఆ డజను మంది వీఆర్వోల రూటే వేరు..!

- 18 ఏళ్లుగా కదలకుండా అడ్డగోలు దోపిడీ
- రూ.కోట్లలో ఆస్తులు కూడగట్టి లగ్జరీ లైఫ్
- వీఆర్వోలుగా, డాక్యుమెంట్ రైటర్లుగా, రియల్టర్లుగా త్రిపాత్రాభినయం
- తహసీల్దార్లను డమ్మీలు చేసి చెలా'మనీ..'
- వైసీపీ ప్రభుత్వ హయాంలో పెచ్చుమీరిన అవినీతి
- కొండలు, గుట్టల్లో అడ్డగోలు తవ్వకాలకు ఊతం
- మైనింగ్ మాఫియాతో వాటాలు పంచుకుని వ్యాపారం
- జోగి రమేశ్ భూ కబ్జాల్లో కీలకంగా ఓ వీఆర్వో
- ప్రస్తుతం బదిలీల నుంచి బయటపడే యత్నాలు

వైసీపీ హయాంలో భారీ దోపిడీ

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ రూరల్ మండల పరిధిలోని ఈ షాడో వీఆర్వోలు అడ్డగోలుగా అక్రమ మైనింగ్‌కు సహకరించారు. కొండలు, గుట్టలు, గట్లు, కాలువ గట్లు, చెరువులు, తోటలు తవ్వుకోవటానికి అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు. అక్రమ మైనింగ్ వ్యాపారులను వాటాలు కూడా అడిగే రేంజ్‌కు వీరు చేరారు. మైనింగ్ మాఫియాను రక్షించేందుకు ఓ వీఆర్వో ఏకంగా వాట్సాప్ గ్రూపునే ఏర్పాటు చేశాడంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఉన్నతాధికారుల తనిఖీలు, ప్రజల ఫిర్యాదులు, ఆకస్మిక తనిఖీలు.. ఇలా సమస్త సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆ వాట్సాప్ గ్రూప్ ద్వారా చేరవేసేవాడు. దీంతో మైనింగ్ మాఫియా అప్రమత్తమయ్యేది. విజయవాడ రూరల్ మండలంలో సాగిన మైనింగ్ మాఫియాపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆగ్రహించింది. వారి ఆదేశాల మేరకు అప్పటి సబ్ కలెక్టర్ అదితిసింగ్ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఈ సమాచారాన్ని స్థానిక వీఆర్వోలు మాఫియాకు చేరవేశారు. అక్రమ మైనింగ్ తవ్వకాల వద్దకు సబ్ కలెక్టర్ చేరుకోకుండా ఉండటానికి ఏకంగా రోడ్డుకు గండి కొట్టించారు.

ధ్రువీకరణ పత్రాల్లో దండుడే..

నగర పరిధిలో ధ్రువీకరణ పత్రాల లావాదేవీలే ఎక్కువగా నడుస్తుంటాయి. ఈ పత్రాల జారీకి సంబంధించి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు (ఎఫ్ఎంసీ) సదరు వీఆర్వోలకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ఎఫ్ఎంసీ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టడం, దరఖాస్తుదారులను తమ చుట్టూ తిరిగేలా చేయటం, ఆ తర్వాత వారితో బేరాలకు దిగటం చేస్తున్నారు. నగరంలో పనిచేసే ఓ వీఆర్వో కమ్ డాక్యుమెంట్ రైటర్‌కు కామవాంఛ ఎక్కువ. గతంలో ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, చివరికి రోడ్డున పడ్డాడు. ఈ ఉదంతం తర్వాత మళ్లీ అక్రమ సంపాదనకు తెరతీశాడు. విజయవాడ రూరల్ మండలంలో ముఖ్యమైన గ్రామంలోని ఓ వీఆర్వో ఏకంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందే డాక్యుమెంట్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. పశ్చిమ నియోజకవర్గం దాటిన తర్వాత మేజర్ గ్రామ పంచాయతీలో వీఆర్వోగా పనిచేసిన వ్యక్తి ఇక్కడి భూములు ఖరీదైనవి కావటంతో రైతుల దరఖాస్తులకు కొర్రీలు వేస్తూ భారీగా అవినీతికి పాల్పడ్డాడు. విజయవాడ నగరంలోనూ, రూరల్ ప్రాంతంలోనూ తిష్ట వేసిన ఈ వీఆర్వోలు ఇక్కడి నుంచి పక్కకు కదలడానికి అస్సలు ఇష్టపడరు. ఇటు అటు మారి సర్దుకుంటారు తప్ప ఆ ప్రాంతాన్ని మాత్రం విడిచిపెట్టరు. వైసీపీ హయాంలో విచ్చలవిడి అవినీతికి పాల్పడ్డ ఇలాంటి వారిని సాగనంపకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదముంది.

ఏజెన్సీల ఆగడాలపై విచారణ

పేదల ఇళ్ల నిర్మాణాల్లో వైసీపీ అక్రమాలపై..

- పేదల డబ్బు దండుకుని ఉడాయించిన ఏజెన్సీలు
- బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన వేలాది ఇళ్లు
- ఇన్నాళ్లూ తప్పించుకున్న వైసీపీకి చెందిన ఏజెన్సీలు
- ప్రభుత్వం మారటంతో విచారణకు ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పేదలకు ఇళ్ల నిర్మాణం పేరిట వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు, అనుచరులు, సంస్థలు, ఇళ్ల నిర్మాణ ఏజెన్సీలు చేపట్టిన పనులపై కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన థర్డ్‌పార్టీతో విచారణకు ఆదేశించటంతో ఎన్టీఆర్ జిల్లా కాంట్రాక్టర్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అధికారం చేతిలో ఉంది కదా.. అని పేదల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టులను పొంది, డబ్బు సంపాదించుకుందామని వైసీపీ నాయకులు పన్నాగం పన్నారు. ఆప్షన్-3 కేటగిరీలోకి వచ్చిన ఇళ్ల నిర్మాణ పనులను ఏజెన్సీల ముసుగులో దక్కించుకున్నారు. పేదల వద్ద అందినకాడికి వసూలు చేసి ఉడాయించారు. పనులు మధ్యలోనే ఆపేశారు. దీంతో బేస్‌మెంట్, బిలో బేస్‌మెంట్ దశలోనే చాలా ఇళ్ల పనులు ఆగిపోయాయి. ఈ పనులు కూడా నాసిరకంగానే జరిగాయి. ఈ ఏజెన్సీల నిర్వాకాలపై ఫిర్యాదులు అందాయి. పోలీసు స్టేషన్లలో కూడా కేసులు నమోదయ్యాయి. అప్పుడు ప్రభుత్వం వారిదే కావటంతో ఏజెన్సీలు దర్జాగా తప్పించుకున్నాయి. కనీస విచారణ కూడా చేపట్టలేదు. జిల్లా యంత్రాంగాలు కూడా చర్యలు తీసుకోలేదు. తాజాగా ఏజెన్సీలు చేపట్టిన పనులు, ఇళ్ల నిర్మాణాల నాణ్యతా ప్రమాణాల తనిఖీల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థతో థర్డ్‌పార్టీ విచారణకు ఆదేశించారు. దీంతో సదరు ఏజెన్సీ సంస్థలు ఉలిక్కి పడుతున్నాయి. నున్న మోడల్ లే అవుట్‌లో 10 వేల మందికి ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు 3 వేలకు పైగా ఇళ్లను ఆప్షన్-3లో భాగంగా ఏజెన్సీలకు అప్పగించారు. ఈ పనులను కాంట్రాక్టు సంస్థలకు అప్పగించారు. కానీ, ఆ సంస్థలు రూ.1.80 లక్షలకు చేయలేమని చెప్పటంతో లబ్ధిదారుల నెత్తిన రూ.35 వేల భారం వేశారు. ఈ డబ్బు తీసుకున్న ఏజెన్సీలు బేస్‌మెంట్‌లోనే పనులు వదిలేసి వెళ్లిపోయాయి. ప్రభుత్వం ఇచ్చిన మెటీరియల్, సిమెంట్ వంటి వాటిని కూడా తరలించాయి. కిందటి వైసీపీ హయాంలో ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 71 వేల ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా, కేవలం 5 వేలే పూర్తయ్యాయి.

దానపత్ర రహస్యం

వెంచర్ కోసం సీఆర్డీఏ అధికారి వింత నాటకం


పంచాయతీకి దానపత్రంలో ఇచ్చిన స్థలం (సరిహద్దు రాళ్ల మధ్యలో)

- తన భూమిలో వెంచర్ వేద్దామని రోడ్డు కోసం దానపత్రం
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా అధికార దుర్వినియోగం
- సహకరించిన మైలవరం పంచాయతీ అధికారులు
- ప్రభుత్వం మారడంతో ప్లేటు ఫిరాయింపు
- పంచాయతీ అనుమతి లేకుండా దానపత్రం రద్దు
- విచారణ జరపాలని కలెక్టర్‌కు వార్డు సభ్యుల ఫిర్యాదు

ఆయన సీఆర్డీఏ అధికారి. వైసీపీ పాలనలో తన వ్యవసాయ భూమిలో వెంచర్ వేసి ప్లాట్లు అమ్మి సొమ్ముచేసుకుందామనుకున్నారు. అది వర్కవుట్ కాకపోవటంతో గతంలో రోడ్డు కోసం దానపత్రంగా పంచాయతీకి ఇచ్చిన స్థలాన్ని ఎలాంటి అనుమతీ లేకుండా రద్దు చేసుకున్నారు. దీనికి మైలవరం సబ్ రిజిస్ట్రార్ అధికారులు కూడా సహకరించారు. వెంచర్‌కు, దానపత్రానికి లింకేమిటనుకుంటున్నారు కదా? ఆ ట్విస్ట్ తెలియాలంటే ఈ కథనం చదవాల్సిందే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సీఆర్డీఏ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారికి మైలవరంలోని సర్వేనెంబర్ 126, 126/1లలో 3.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని వెంచర్‌గా అభివృద్ధి చేయాలని భావించి నివేశనా స్థలాలుగా మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించారు. ఆ తర్వాత వెంచర్ కోసం రోడ్డు కావాల్సి ఉండటంతో 20 అడుగుల రోడ్డును సృష్టించాలనుకున్నారు. ఈ రోడ్డు కోసం సుమారుగా 2,297.77 చదరపు గజాల తన స్థలాన్ని ప్రజోపయోగార్థం పంచాయతీకి దానపత్రంగా ఇచ్చారు. ఈ దానపత్రం మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ 2333/2023గా నమోదైంది. దానపత్రంలో గ్రామ పంచాయతీకి తన స్థలాన్ని ప్రజోపయోగార్థం అభివృద్ధి చేయడానికి సర్వాధికారాలను ఇస్తున్నట్టు దానపత్రంలో పేర్కొన్నారు. ఈ దానపత్ర వ్యవహారాన్ని మైలవరం గ్రామ పంచాయతీ అధికారులు పాలకమండలి సమావేశం దృష్టికి తీసుకురాకుండా రికార్డుల్లోకి ఎక్కించకుండా చాలా కాలంపాటు రహస్యంగా ఉంచారు.ఈ వ్యవహారానికి అప్పటి పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు అడ్డగోలుగా సహకరించారు.

పరిశీలన ఆసక్తికర అంశాలు వెలుగులోకి..

ఈ దానపత్ర వ్యవహారం పంచాయతీ పాలకవర్గ సభ్యుల దృష్టికి రావటంతో అప్పట్లో 12వ వార్డు మెంబర్ అయిన ముద్దర నాగ వెంకట చిట్టిబాబు దీనిపై లోతుగా పరిశీలించి సీఆర్డీఏ, ఎంఏయూడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరెవరూ ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదు. దీంతో చిట్టిబాబు రాష్ట్ర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతం తర్వాత వెంచర్ ఏర్పాటు కోసం సీఆర్డీఏ అధికారి దరఖాస్తు చేసుకోలేదు.

ప్రభుత్వం మారడంతో రూటు మార్చిన అధికారి

గతంలో చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతోంది. ఈలోపు ఎన్నికలు రావటం కూటమి అధికారంలోకి రావటంతో తనపై సమగ్ర విచారణ జరుగుతుందని సీఆర్డీఏ అధికారి రూటు మార్చారు. గతంలో పంచాయతీకి సర్వాధికారాలు దఖలు పరిచిన ఈ అధికారి గ్రామ పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా దానపత్రాన్ని రద్దు చేయటానికి సిద్ధపడ్డారు. మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెంబర్ 7869/2024 ద్వారా దానపత్రాన్ని రద్దు చేసుకున్నారు. మైలవరం సబ్‌రిజిస్ట్రార్ అధికారులు ఇందుకు సహకరించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజనకు వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారణలో ఉన్న ఈ వ్యవహారంపై మైలవరం సబ్ రిజిస్ట్రార్ అధికారులు ఎలాంటి విచారణా జరపకుండా దానపత్రం ఎలా రద్దు చేస్తారని, తక్షణం ఈ వ్యవహారంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి నాయక్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా ఉంది. సీఆర్డీఏ కమిషనర్ కూడా దీనిపై దృష్టి సారించాలని వార్డు సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

- బాలికలతో అసభ్యంగా ప్రవర్తించినట్టు

చైల్డ్ లైఫ్, ఐసీడీఎస్ అధికారుల విచారణలో స్పష్టం

కోడూరు, ఆగస్టు 20 : విద్యార్థులకు సత్ప్రవర్తన నేర్పించవలసిన ఉపాధ్యాయులు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇద్దరు ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెర్దా సుల్తానా సోమవారం సస్పెండ్ చేశారు. కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాబోధనలు చెప్పే ఉపాధ్యాయులు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటంతో బాలికల తల్లిదండ్రులు 1098కు ఫిర్యాదు చేయగా, చైల్డ్ లైఫ్ అధికారులు, ఐసీడీఎస్ అధికారులు విశ్వనాథపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను పూర్తిస్థాయిలో విచారించి వివరాలు సేకరించారు. పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (హిందీ)గా పని చేస్తున్న విస్సంశెట్టి రామాంజనేయులు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పి.శివనాగరాజుపై నివేదిక జిల్లా విద్యాశాఖ అధికారిణికి సమర్పించారు. ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ అధికారిణి ఉత్తర్వులు జారీ చేశారు.

6 కేజీల గంజాయి స్వాధీనం

గుడివాడ రూరల్, ఆగస్టు 20 : గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 కేజీల 300 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ సోమవారం సాయంత్రం రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు, సిబ్బంది కలసి శ్రీకాళహస్తి కాలనీలో ఊరు బయట దొండపాడు రోడ్డులో ద్రోణాదుల వారి వీధికి చెందిన మైనర్ బాలుడు, ఇద్దరు వ్యక్తుల వద్ద 6 కేజీల 300 గ్రాముల గంజాయి గుర్తించామన్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు పారిపోగా, మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. చైల్డ్ క్రాన్ఫ్లిక్ట్ విత్ లా (మైనర్)ను జువైనల్ హోంకు తరలించామన్నారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- జిల్లా గృహ నిర్మాణ సమీక్షలో మంత్రి కొలుసు పార్థసారథి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ సృజన తదితరులు

కృష్ణలంక, ఆగస్టు 20 : 'పేదలకు ఇళ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రధానం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే' అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంత్రి పార్థసారథి నేతృత్వంలో గృహ నిర్మాణంపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏపీఎస్‌హెచ్‌సీఎల్‌ఎండీ పి.రాజాబాబు, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, మైలవరం, తిరువూరు శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హాజరయ్యారు. జిల్లాలో మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్లు తదితరాలను కలెక్టర్ సృజన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో పీఎంఏవై అర్బన్ (బీఎల్‌సీ) కింద 1,08,836 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 18,820 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. 40,536 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందన్నారు. పీఎంఏవై-గ్రామీణ్ కింద 6,567 ఇళ్లు మంజూరు కాగా 2,127 ఇళ్లు పూర్తయ్యాయని వివరించారు. నరేగా కాంపోనెంట్, మెటీరియల్ స్టాక్, లే అవుట్‌లలో మౌలిక వసతులు, ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలు, నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి తదితరాలను కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలు, వాటిని చేరుకొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పార్థసారథి దిశానిర్దేశం చేశారు.

- **లబ్ధిదారులను ప్రోత్సహించాలి**

వివిధ లే అవుట్‌లలో విద్యుత్, నీరు, అంతర్గత రహదారులు తదితర వసతులు ఉన్నందున త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు చొరవ చూపాలని, ఇందులో భాగంగా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. గృహ నిర్మాణం, డీఆర్‌డీఏ, మెప్మా, మున్సిపల్, డ్వామా, లీడ్‌బ్యాంక్, మండల, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు తదితరులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పీఎంఏవై అర్బన్ (బీఎల్‌సీ), గ్రామీణ పరిధిలో దాదాపు 9 వేల ఇళ్ల నిర్మాణాలు లింటెల్ లెవెల్, రూఫ్ లెవెల్, రూఫ్ క్యాస్ట్ లెవెల్‌లో ఉన్నాయని, 100 రోజుల ప్రణాళికలో భాగంగా వీటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తమ తమ నియోజకవర్గాలలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ జీవీ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ పీడీ రజనీకుమారి, ఆర్‌డీఓలు బీహెచ్.భవానీశంకర్, ఎ.రవీంద్రరావు, కె.మాధవి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, మండల అధికారులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో అవకతవకలపై విచారణ

విచారణ పూర్తయ్యాక కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తా - డీఎంహెచ్‌వో గీతాబాయి

మచిలీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కరోనా సమయంలో మచిలీపట్నంలోని సర్వజన ఆసుపత్రిలో పరికరాలు, మందులు, ఇతరత్రా సామగ్రి కొనుగోలు, తదితర అంశాలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లావైద్యశాఖ అధికారి గీతాబాయి మంగళవారం విచారణ నిర్వహించారు. సర్వజన ఆసుపత్రి కరోనా సమయంలో జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిగా కొనసాగేది. కరోనా బాధితుల కోసం దాతలు, వివిధ సంస్థలు ఇచ్చిన బెడ్‌లు, ఆక్సిజన్ సిలిండర్‌లు, ఇతరత్రా సామగ్రిని ఆసుపత్రి ద్వారా కొనుగోలు చేసినట్టు చూపి అప్పటి ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ ఉల్లి కృష్ణ పెద్దమొత్తంలో బిల్లులు చేసుకున్నట్టు కొందరు ఆసుపత్రి సిబ్బంది ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై విచారణ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయిని కలెక్టర్ బాలాజీ విచారణాధికారిగా నియమించారు. దీనిపై విచారణకు హాజరుకావాలని గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సూపరింటెండెంట్‌లతోపాటు, డీసీహెచ్‌ఎస్, ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, స్టాఫ్‌నర్సులు 24 మందికి ఈనెల 20వ తేదీన జరిగే విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. మంగళవారం జరిగిన విచారణకు కొంతమంది మాత్రమే హాజరయ్యారు. వీరి నుంచి డీఎంఅండ్‌హెచ్‌వో స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఆసుపత్రి రికార్డులను ఆమె పరిశీలించారు. కొందరు అధికారులు, సిబ్బంది ఇంకా విచారణకు హాజరుకావాల్సి ఉందని, విచారణ పూర్తిచేసిన అనంతరం తుది నివేదికను కలెక్టర్‌కు పంపుతామని డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు.


సర్వజన ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి

- **సీనియర్ అసిస్టెంట్ ఉల్లికృష్ణపై ఆరోపణలు**

మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉల్లి కృష్ణపై పలు ఆరోపణలు రావడంతోనే ఈ అంశంపై కలెక్టర్‌కు సిబ్బంది ఫిర్యాదు చేశారు. తూర్పు కృష్ణా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఉల్లి కృష్ణ గతంలో వైసీపీ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే పేర్ని నానికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి నుంచి అవనిగడ్డ ఆసుపత్రికి ఆయన బదిలీపై వెళ్లారు. జిల్లా కేంద్రంలో ఆయన పనిచేయడం లేదని, తూర్పు కృష్ణా ఎన్‌జీవో అసోషియేషన్ అధ్యక్షుడిగా పనిచేసేందుకు ఆయన అర్హత కోల్పోయాడని కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. మచిలీపట్నంలో నిర్మించిన ఎన్‌జీవో హోమ్ భవనానికి గతంలో ఎంపీగా పనిచేసిన కొనకళ్ల నారాయణరావు మంజూరుచేసిన రూ.20 లక్షల నిధులు, భవనం నిర్మాణం కోసం ఉద్యోగులు ఇచ్చిన రూ.18 లక్షల విరాళాలను పక్కదారి పట్టించారనే ఆరోపణలు చేస్తున్నారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో అవినీతి జరిగిందనే అంశం వెలుగులోకి రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. రెండు, మూడు రోజులపాటు ఈ విచారణ కొనసాగనుందని, విచారణ పూర్తయిన తరువాత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై సర్వత్రా చర్చనడుస్తోంది.

దుర్గగుడిలో ముగిసిన పవిత్రోత్సవాలు


పూర్ణాహుతిలో హోమద్రవ్యాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అర్చకులు

వన్‌టౌన్, ఆగస్టు 20 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడురోజుల పాటు వైభవంగా జరిగాయి. వేదపండితుల వేదఘోష, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. అమ్మవారికి చేరేందుకు పట్టువస్త్రాన్ని సమర్పించారు. ఆద్యంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఈవో దంపతులు యాగశాలలో వేద పండితులను సత్కరించి ఆశీర్వచనం అందుకున్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న వారికి అర్చకులకు, సిబ్బందికి ఈవో రామారావు ప్రసాదాలను, పవిత్రాలను అందజేశారు.

- **నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం**

దుర్గగుడిలో జరుగుతున్న అన్నవితరణ కార్యక్రమానికి రాజమండ్రిలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన బి.వెంకట తిమ్మరాజు పేరిట బూరుగుపల్లి శ్రీనివాసరావు, బి.శివరామకృష్ణ పేరిట బూరుగుపల్లి శ్రీరామరావు, నితిష్ కృష్ణ, బి.తిమ్మరాజుల పేరిట రూ.1.25 లక్షల చొప్పున మొత్తం రూ.5 లక్షల విరాళాన్ని అందచేశారు.


మేళతాళాలతో పవిత్రాలను తీసుకువస్తున్న ఈవో రామారావు, అర్చకులు


మునిసిపల్ రోడ్డులో ప్లాటు యజమాని నిర్మించిన ప్రహరీ

ముందు చోద్యం.. తరువాత నోటీసు!

- అక్రమ లే అవుట్‌లపై మునిసిపల్ అధికారుల వింత వైఖరి

జగ్గయ్యపేట, ఆగస్టు 20 : జగ్గయ్యపేట పురపాలకసంఘ పరిధిలో విచ్చలవిడిగా అనధికారికంగా లే అవుట్‌లు పెడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు నిద్ర నటిస్తున్నారు. లే అవుట్‌లు వేసేటప్పుడు అడ్డుకోకుండా చోద్యం చూడటం, అంతా అయిపోయాక నోటీసులు ఇవ్వడం పరిపాటిగా మారింది. శాంతినగర్ వ్యవహారంలో జాయింట్ సర్వే చేయించకుండా అధికారులు ప్లాట్ యజమానికి పరోక్షంగా సహకరించారు. రోడ్డు పగులగొట్టడానికి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు గోడ కట్టుకునేదాకా చూస్తూ ఊరుకుండిపోయారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

పట్టణంలో 31వ వార్డులోని శాంతినగర్ పరిధిలో వైదేహి అపార్ట్‌మెంట్ వెనుక గత ఎన్నికల ముందు రూ.4.50 లక్షలతో మున్సిపల్ అధికారులు రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసేదాకా మాట్లాడని ప్లాట్ యజమాని అంతా పూర్తయ్యాక తన స్థలంలో రోడ్డు వేశారని అభ్యంతరం చెప్పారు. ఇప్పుడు తాజాగా మునిసిపల్ అధికారులు ఇచ్చిన ఎండార్స్‌మెంట్‌ను గుప్పిట పెట్టుకుని మునిసిపల్ స్థలంలో ప్రహరీ నిర్మించారు. మంగళవారం ఉదయం నుంచి పని జరుగుతున్నా స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మునిసిపల్ అధికారులు సాయంత్రం అంతా అయిపోయాక ప్లాట్ యజమాని పుల్లారావుకు నోటీసు ఇచ్చారు. మునిసిపాలిటీ రోడ్డులో కట్టిన ప్రహరీని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకపోతే తాము తొలగించి ఆ డబ్బులు రికవరీ చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. కమిషనర్ నాగమల్లేశ్వరరావు వివరణ కోరగా ప్రహరీ నిర్మించారని తమ దృష్టికి రాగానే నోటీసు ఇచ్చామని సమర్థించు కున్నారు.


ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఎ.కొండూరు : మండలంలోని కంభంపాడు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో జువాలజీ, కామర్స్ గెస్ట్ బోధన సిబ్బంది పోస్టుల భర్తీ కోసం ఈ నెల 21న దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఝాన్సీ తెలిపారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు 21 బుధవారం మధ్యాహ్నం 3 గంటలలోపు రెండు సెట్ల దరఖాస్తులు అందజేయాలని, 22న ఉదయం 11 గంటలకు విజయవాడలోని పాయకాపురం, రాధానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు గరిష్ఠంగా రూ.10 వేలు వరకు జీతం చెల్లించబడుతుందన్నారు.

ఇంగ్లీష్, ఫిజిక్స్ అధ్యాపకుల నియామకానికి హాజరు కావాలి

గంపలగూడెం : గంపలగూడెం ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, ఫిజిక్స్ సబ్జెక్టుల బోధనకు అతిథి అధ్యాపకుల పోస్టుల నియామకానికి ఈనెల 22న ఉదయం 11 గంటలకు విజయవాడలోని పాయకాపురం రాధానగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్యాంపస్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో డెమో క్లాసులకు అర్హత కలిగిన అభ్యర్థులు హాజరు కావాలని ప్రిన్సిపల్ జి.అనురాధ మంగళవారం తెలిపారు.

డాక్టర్ల రక్షణకు చర్యలు



అఘాయిత్యాలు నిరసిస్తూ స్కిట్

- **సీఎంతో సంప్రదించి నిర్ణయిస్తాం : హోంమంత్రి వంగలపూడి అనిత**

మొగల్రాజపురం, ఆగస్టు 20 : డాక్టర్లపై అఘాయిత్యాలు జరిగితే నిందితులకు ఇప్పుడున్న చట్టం ప్రకారం మూడేళ్ల శిక్ష ఉంటుందని, బెయిల్ కూడా సులువుగా వస్తోందని చట్టాన్ని మార్చి నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదయ్యేలా చేయాలని, 3 నుంచి 7 ఏళ్ల శిక్షపడేలా చూడాలని వచ్చిన విజ్ఞాపనను సీఎం చంద్రబాబుతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. దానితోపాటే సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పోరాడటంతోపాటు బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. కలకత్తాలో వైద్య విద్యార్థిని డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ నిందితుడికి కఠిన శిక్ష సత్వరమే విధించాలని, ప్రతి స్త్రీ భద్రత మన బాధ్యత అనే నినాదంతో డివి మానర్ హోటల్ నుండి టిక్కిల్ రోడ్డుమీదుగా పీబీ సిద్ధార్థ కళాశాల వరకు వాసవ్య మహిళా మండలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇతర డాక్టర్స్ అసోసియన్స్ సంయుక్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీతో పాటు అనంతరం జరిగిన సభలో మంత్రి అనిత మాట్లాడారు. ఎక్కడో ఒక సంఘటన జరిగినప్పుడు ఇక్కడ ఇలాంటి కార్యక్రమాలు ఎంటనే కామెంట్స్ వస్తున్నాయని ఆటువంటి వారు మారాలని ఇక్కడ ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల మన దగ్గర కూడా అవేర్‌నెస్ వస్తుందని అందరు జాగ్రత్తగా ఉంటారని చెప్పారు. చాలా మంది పేరంట్స్ కూడా గుర్తించి జాగ్రత్త పడాల్సిన విషయం ఒకటుందని పిల్లలకు సెల్ ఫోన్‌లు ఇచ్చి పనుల్లో పడుతున్నారని కాని వారు అందులో పోర్న్ చూసి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని అందుకు ఉదాహరణ ఇటీవల నంద్యాలలో 7 సంవత్సరాల బాలికను ముగ్గురు మైనర్‌లు హత్యాచారం చేసిన ఘటన అన్నారు. పాఠశాల స్థాయి నుండే ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఎంటో కూడా తెలిసే విధంగా చూస్తామని చెప్పారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ మాట్లాడుతూ ఇంట్లో మగ పిల్లలకు కూడా తల్లిదండ్రులు మంచి విలువలు నేర్పాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాసవ్యమహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి. కీర్తి మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల విద్యార్థినులు కలకత్తాలో జరిగిన దారుణం కళ్లకు కట్టే విధంగా ప్రదర్శించిన స్కిట్ కంటి తడిపెట్టించింది. ఆఘాయిత్యాలపై శ్రీలత వేసిన చిత్రాన్ని సీఎం చంద్రబాబుకు ఇవ్వాలని కోరుతూ హోం మంత్రి అనితకు అందించింది.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

- **పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు**



అజిత్‌సింగ్‌నగర్ : మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు అన్నారు. నగరంలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం కమిషనరేట్ పరిధిలోని పలువురు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, గంజాయి, మద్యం అక్రమ రవాణా, దొంగతనాలు, కొట్లాటలు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చేడు నడత కలిగిన వ్యక్తులపై నగర బహిష్కరణ, పీడీ యాక్ట్ పెట్టి నేరాలను నియంత్రించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసుతో పాటు పహారా నిర్వహించి అనుమానితులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో లా అండ్ ఆర్డర్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది అవగాహనతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పటిష్ఠ నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో డీసీపీలు గౌతమి షాలి, కెఎం.మహేశ్వరరాజు, టి.హరికృష్ణ, చక్రవర్తి, అడిషనల్ డీసీపీలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

ఆరుగొలను హైస్కూల్‌కు ఫ్యాన్లు అందజేత



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 20 : ఆరుగొలను హైస్కూల్‌కు రూ. 40వేల విలువైన ఫ్యాన్లను మంగళవారం లయన్స్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నందిగం స్వామి అందజేశారు. విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని చదువుల్లో మరింత మెరుగ్గా రాణించాలని మేడికొండ బుచ్చిబాపయ్య విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు, అక్కినేని రామవేంద్రరావు, మాకినేని శ్రీనివాసరావు, మూల్పూరి సురేంద్ర, హెచ్ఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

గన్నవరంలో టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



టీడీపీ కార్యాలయం ప్రారంభం అనంతరం పూజలు చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఆగస్టు 20 : నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాననితమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకే అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. గన్నవరం గ్యాస్ కంపెనీ దగ్గరలో టీడీపీ నూతన కార్యాలయాన్ని సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా వేద పండితులచే పూజలు నిర్వహించి ప్రారంభించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ జెండాలను ఆయా నాయకులతో కలిసి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో భాగంగా మల్లవల్లి, వీరపనేని గూడెం పారిశ్రామికవాడల అభివృద్ధికి పలు దఫాలుగా పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ కంపెనీని పునఃప్రారంభించడానికి విశేష కృషి చేస్తున్నానని, త్వరలో నియోజకవర్గంలోని 15వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి, పోలవరం కుడికాలువ 137వ కిమీ బండారుగూడెం నుంచి ఏలూరు కాలువకు గోదావరి జలాలను తీసుకువచ్చి అనుసంధానం చేసే పథకానికి త్వరలోనే టెండర్‌లు పిలవడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పోలవరం కుడి కాలువ నుంచి గన్నవరం మండలంలోని బ్రహ్మయ్యలింగం చెరువుకు గోదావరి నీటిని తీసుకువెళ్లి రిజర్వాయర్‌గా మార్చడానికి ఇప్పటికే అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయంలో సిబ్బంది అన్ని రోజులు అందుబాటులో ఉంటారని, వారానికి రెండు రోజులు తాను ఉంటానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ నాయకుడు చిగురుపాటి కుమారస్వామి, జనసేన నాయకుడు బండ్రెడ్డి రవి, బచ్చుల బోస్, జాస్తి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, గొడ్డళ్ల చిన రామా రావు, దయాల రాజేశ్వరరావు, బోడపాటి రవికుమార్, కోనేరు సందీప్, ఆళ్ల హనోక్, పుట్ట సురేష్, మూల్పూరు సాయికళ్యాణి, కోనేరు నాని, జూపల్లి సురేష్, మేడేపల్లి రమ, చిమట రవివర్మ, నాదెండ్ల మోహన్, గూడవల్లి నర్సయ్య, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, మండవ అన్వేష్, పరుచూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జరిగిన క్యాండిల్ ర్యాలీలో బోడె ప్రసాద్, తదితరులు



ఉయ్యూరులో సీఐటీయూ, ఐద్వా సంఘాల నిరసన

వైద్యుల రక్షణకు చట్టం చేయాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 20 : వైద్యుల రక్షణకు చట్టం ఏర్పాటు చేయాలని, వైద్యులపై దాడులకు పాల్పడే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన వైద్యురాలు హత్యాచారానికి నిరసనగా మంగళవారం తాడిగడప సెంటరు నుంచి పోరంకి సెంటరు వరకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జరిగిన క్యాండిల్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ హత్యాచారానికి నిరసనగా జరిగిన పాదయాత్రలో వందల మంది టీడీపీ, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు సేవలందించడానికి వైద్య వృత్తిని ఎంచుకొన్న వైద్యుల మాన, ప్రాణ రక్షణకు ప్రతి వ్యక్తి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ముసునూరి శ్రీనివాసరావు, సంగెపు రంగారావు, జనసేన నాయకులు వీరన్‌కుమార్, ముప్పా రాజా, గరికపాటి ప్రసాద్, పండమనేని శ్రీనివాస్, మేకా సుబ్బారావు, వడ్డీ జీవా, తాతపూడి గణేష్, పెనమలూరు వైద్యులు శ్రీనివాస్, రాజా, సాయిలలిత, టీడీపీ నాయకులు వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, మల్లంపాటి విజయలక్ష్మి, అంగిరేకుల మురళి, తుమ్మల రాంకుమార్, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ఉయ్యూరు : కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ సీఐటీయూ, ఐద్వా మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉయ్యూరు సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.శివనాగేంద్రం మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, మహిళా రక్షణకు భద్రత పెంచి కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెచ్చుమీరిపోతు న్నాయని, అరికట్టడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందుతున్నాయని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రజనీ ఆరోపించారు. సహాయ కార్యదర్శి బి. కీర్తి, మహిళా సంఘ నాయకురాలు వి. ఝాన్సీ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి.రాజేష్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు, వాకా రామచంద్రరావు, శీలం నారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు బసంతీ, సత్యవతి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతు అభ్యున్నతే ధ్యేయం

చైర్మన్ చలసాని ఆంజనేయులు



మహిళా పాడిరైతుకు బోనస్ అందజేస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 20 : పాడిరైతు సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా రైతు కుటుంబాల సాధికారికత కోసం కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకులపాడు పాలసొసైటీలో పాడిరైతులకు మంగళవారం ఆయన బోనస్ పంపిణీ చేశారు. కాకులపాడు సొసైటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొదటి నాలుగు నెలల ముందస్తు బోనస్‌గా రూ.1,04,660 పంపిణీ చేశారు. పాడిరైతుకు సాంకేతిక సహకారమందించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందించే గోకులం లాంటి పథకాలతో పాటు మేలు జాతి పశువుల కొనుగోలుకు సహకారం, మేలుజాతి పశువుల ఉత్పత్తికి అవసరమైన సెమన్‌ను సబ్సిడీపై రైతులకు అందిస్తూ పాడిపరిశ్రమ ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తి దారులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి

కంకిపాడు, ఆగస్టు 20 : అన్న క్యాంటీన్లలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటంతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, పేదలకు రూ. 5 కే పట్టెడు అన్నం పెడుతున్న అన్న క్యాంటీన్ పథకం అభినందనీయమన్నారు. అయితే అన్న క్యాంటీన్‌లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో తామే ప్రతి అన్న క్యాంటీన్‌లో పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు బోయిన నాగరాజు, సుంకర శివ, ఓంకార్, కుంటా గంగాధర్, జక్కా రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల రక్షాబంధన్



బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రక్షాబంధన్

ఉయ్యూరు, ఆగస్టు 20 : బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో మంగళవారం రక్షాబంధన్ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మచిలీపట్నం బ్రహ్మకుమారీ బ్రాంచ్ హెడ్ భారతి ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక బ్రహ్మకుమారీలకు రక్షాబంధన్ చేశారు. రక్షాబంధన్ విశిష్టతను ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రేమ, దయ, క్షమ, సోదర భావంతో మెలగాలని సూచించారు. బ్రహ్మకు మారి మాధవి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 20 : వీరవల్లిలో విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనులు మంగళవారం ప్రారంభించారు. వీరవల్లి వట్టిగుడిపాడు రహదారిలో వీరవల్లి రైల్వే గేటు వరకు గల పాత విద్యుత్ స్తంభాలను తీసివేసి నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా విద్యుత్ సిబ్బంది అవగాహన లోపంతో క్రాస్‌ఆర్మ్ (విద్యుత్ తీగల పట్టీ) రహదారిపైకి వచ్చేలాగా వేయడంతో గ్రామస్తులు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయిల్‌పామ్, చెరకులాంటి భారీ లోడు వాహనాలు, ఫ్యాక్టరీలకు వెళ్లే భారీ వాహనాలు తిరిగే రహదారిపై విద్యుత్ లైన్లు వచ్చేలా వేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని స్థానిక టీడీపీ నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణ, వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత తదితరులు ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కె. విజయ కుమార్ (విజయవాడ) దృష్టికి తీసుకువెళ్లారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన తక్షణం క్రాస్‌ఆర్మ్‌లు రహదారికి బయట ప్రక్కకు వచ్చేలా పనులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

అన్నదాతలపై ప్రభుత్వం వివక్ష

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ఉయ్యూరు, ఆగస్టు 20 : దేశానికి అన్నం పెట్టే అన్నదాతలపట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందని కౌలు రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి ఎం. హరిబాబు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా రాష్ట్రంలో చిన్న, సన్నకారు, కౌలు రైతులకు రూ. 20 వేలు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థికసాయం చేస్తామని హామీఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు విధి విధానాల ప్రకటన చేయక పోవడం శోచనీయమన్నారు. సున్నా వడ్డీ పథకం గురించి మాట్లాడం లేదన్నారు. రైతులకు రూ. 20వేల ఆర్థికసాయం వెంటనే అందజేయాలన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరి శివనాగేంద్ర, కార్యదర్శి పంచకర్ల రంగారావు, శీలం నారాయణ, వాకా రామచంద్రరావు, మధు, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.



సామూహిక కార్యక్రమాలకు ఉచితంగా ఇచ్చే స్టీలు సామన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం

పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 20 : మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం, చెట్లను కొట్టేయటంతో పర్యావరణానికి విఘాతం కలుగుతోందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం సూచించారు. హనుమాన్‌జంక్షన్ మానవత కార్యాలయంలో సామూహిక కార్యక్రమాలకు ఉచితంగా ఇచ్చే స్టీలు సామన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. సామూహిక కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తగ్గించేందుకు స్టీల్‌ప్లేట్లు, గ్లాసులు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చలం, కొండలరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గేదెలు మృతి చెందడం బాధాకరం



మృతి చెందిన గేదెలను పరిశీలిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 20 : విజయవాడ మునిసిపాలిటీ సీవేజీ ప్లాంట్ల నుంచి విడుదలయ్యే నీళ్లు తాగి పశువులు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని కంపెనీల సీవేజీ ప్లాంట్ల నుంచి విడుదలయ్యే నీటిలో విషపూరిత రసాయనాలు ఉన్నాయని గత ప్రభుత్వంలోనూ ఫిర్యాదులు వచ్చాయని, ఈ ఇబ్బందులపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, కమిషనర్‌తో మాట్లాడానని తెలిపారు. ఇదిలాగే కొనసాగే పక్షంలో మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



దోమకాటుతో ప్రబలే జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఉయ్యూరు, ఆగస్టు 20 : దోమకాటుతో పలు ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్న పరిస్థితుల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమకాటుకు గురికాకుండా తీసుకోవాలిసిన జాగ్రత్తలపై ఏజీ అండ్ ఎస్‌జీ ఎస్ కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకుని కళాశాల జంతుశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం పుల్లేటికట్ట ఏరియాల్లో పర్యటించి దోమల నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలు, దోమకాటుతో ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆడ దోమల వల్ల మలేరియా వ్యాపిస్తుందని సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆగస్టు 20వ తేదీని ప్రపంచ దోమల దినోత్సవంగా నిర్వహిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్ వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శివనాథ్ ప్రారంభించారు. జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్తాబాద జడ్పీ హైస్కూల్‌లో..

గన్నవరం : విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రామారావు అన్నారు. మండలంలోని ముస్తాబాద జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాగ్రత్తలతోనే మలేరియాను నిర్మూలించగలమని చెప్పారు. ఇళ్ల ఆవాసాల మధ్య నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీ రామ్ గోపాల్, డాక్టర్ పర్వతనేని హర్ష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కొండపావులూరు, జక్కుల నెక్కలం, చనుపల్లివారిగూడెం గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందజేశారు.

కళ్లకలక పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు, ఆగస్టు 20 : కళ్లకలకపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అనాహిత కాటే అన్నారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణలో జరిగిన వైద్య సదస్సులో ఆమె మాట్లాడుతూ, కళ్లకలక సంభవించడానికి వైరస్‌లు, బాక్టీరియా ప్రధానకారణాలని, ఇది అంటువ్యాధి అని తెలిపారు. కళ్లకలక నివారించడానికి పరిశుభ్రత అత్యంత అవసరమని, కళ్లకలక బారిన పడ్డవారు వెంటనే వైద్యులను కలవాలని సూచించారు.

సంప్రదాయాల్లోని విజ్ఞానాన్ని తెలియజేసేందుకే సామూహిక హారతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 20 : సనాతన సంప్రదాయాల్లోని విజ్ఞానాన్ని ప్రజలకు ముఖ్యంగా యువతకు తెలియజెప్పేందుకు ఆలయాలే శక్తి కేంద్రాలుగా సామూహిక హారతి లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆర్ఎస్ ఎస్ ఖండ కార్యవాహ్ ఎదురువాడ శ్రీనివాసరావు తెలిపారు. రంగన్నగూడెం, వేలేరు, కాకులపాడు గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సామూహిక హారతి, పూజలు నిర్వహించారు. రంగన్నగూడెం శ్రీకృష్ణదే వాలయం నిర్వహించిన సామూహిక హారతి కార్యక్రమంలో సమరసత గ్రామ కన్వీనర్ కొలుసు బలరాం, భక్తి బృంద సభ్యులు పాల్గొన్నారు, వేలేరు మద్దిరావమ్మతల్లి దేవస్థానంలో నిర్వహించిన పూజల్లో హారతి ప్రముఖ్ లక్ష్మి, భక్తి బృంద సభ్యులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75

నగర పాలక సంస్థ మాస్టర్ ప్లాన్‌కు తుది మెరుగులు

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నగర పాలక సంస్థ మాస్టర్ ప్లాన్‌కు తుది మెరుగులు దిద్దేందుకు మంగళవారం ముడా కార్యాలయంలో వివిధ డివిజన్ల టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముడా వీసీ వెంకటరమణ పర్యవేక్షణలో రోడ్ల విస్తరణ, పార్కుల అభివృద్ధి, వ్యాపార వాణిజ్య సంస్థల గుర్తింపు వంటి వివిధ అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని ముడా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. అన్ని డివిజన్ల నాయకులకు చూపించి ఫైనలైజ్ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పిప్పళ్ళ కాంతారావు, సనకా నాగులు, చిన్నం శివ, బత్తిన దాసు, పి.వి. ఫణికుమార్, కిరణ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. కొన్ని గృహ సముదాయాలు, చర్చిలను వ్యాపార సముదాయాలుగా పేర్కొన్నారంటూ నాయకులు అభ్యంతరం తెలియచేశారు.

మీరు నేర్పిన విద్యే నీరజాక్ష

● తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని వైసీపీ కార్పొరేటర్లు చెప్పడంపై టీడీపీ కార్పొరేటర్ల కౌంటర్

● వాడివేడిగా నగర కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న టీడీపీ కార్పొరేటర్లు, వాగ్వాదానికి దిగిన వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 20 : తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ వైసీపీ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో అధికారులపై విరుచుకుపడ్డారు. నగర కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం వాడి వేడిగా జరిగింది. తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ వైసీపీ కార్పొరేటర్లు అనడంపై టీడీపీ కార్పొరేటర్లు ఘాటుగా స్పందించారు. మీరు నేర్పిన విద్యే నీరజాక్ష అంటూ మరకాని సమతాకీర్తి వైసీపీ కార్పొరేటర్లకు కౌంటర్ ఇచ్చారు. టీడీపీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని మూడేళ్లుగా తాము మొత్తుకుంటున్నా వినిపించుకోలేదని టీడీపీ ఫ్లోర్ లీడర్ మరకాని సమ తాకీర్తి, కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, అన్నం ఆనంద్, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి ఘా టుగా సమాధానం చెప్పారు. టీడీపీ కార్పొరేటర్లకు సచివాలయాల్లో కూర్చునేందుకు కుర్చీ కూడా వేసే వారు కాదన్నారు. మూడేళ్లుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఏనాడూ టీడీపీ కార్పొరేటర్లకు ఆహ్వానాలు రాలేదన్నారు. ఆగస్టు 15న జాతీయ జెండా ఎగురవేసేందుకు వైసీపీ కార్పొరేటర్లను ఆహ్వానించలేదని మేకల సుబ్బన్న అన్నారు. జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి మాట్లాడుతూ, మూడేళ్లుగా తమకు జాతీయ జెండా ఎగుర వేసేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. శానిటేషన్‌పై గంట సేపు చర్చ జరిగింది. వీధి దీపాలకు తమకు తెలియకుండానే టెండర్లు పిలిచేశారని వైసీపీ కార్పొరేటర్ అస్గర్ తదితరులు అన్నారు. డిప్యూటీ మేయర్‌కు తెలియకుండానే పైపులైన్లు వేస్తున్నారని శీలం భారతి అనగా, పైపులైన్ల లీకులు జరిగే చోట పైపులు వేస్తున్నారని కమిషనర్ బాపిరాజు తెలిపారు. తన ఇంట్లో నిర్వహిస్తున్న సచివాలయాన్ని మార్చివేశారని, బాకీ కూడా చెల్లించలేదని అధికారులను 40వ డివిజన్ కార్పొరేటర్ శైలజ అన్నారు. ప్రజల కోరిక మేరకే సచివాలయం మార్చామని, అద్దె బకాయిలు త్వరలో చెల్లిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. మూడేళ్లుగా జీరో అవర్‌లో ప్రశ్నించేందుకు టీడీపీకి అవకాశం ఇవ్వని వైసీపీ కార్పొరేటర్లు ఇప్పుడు పలు అంశాలపై చర్చకు దిగడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అనంతరం 12 అంశాలను కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు పాల్గొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి కౌన్సిల్ సమావేశం కావడంతో పోలీసులు ముందు జాగ్రత్త గా కౌన్సిల్ హాలు బయట బందోబస్తు చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెడన : బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ కె.సి.ఎస్. వి.ఎస్. రామారావు తెలిపారు. కామర్స్ సబ్జెక్టులో జనరల్ కామర్స్‌లో ఒకటి, ఒకేషనల్ కామర్స్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంకాం 50 శాతం మార్కులతో పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈనెల 24న మచిలీపట్నంలోని లేడీయాంప్థిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. **నందివాడ :** రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా సివిక్స్ బోటని అధ్యాపకుల పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ పి.బి.సాల్మాన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు (పీజీ 50 శాతం మార్కులు) జత పరిచి ఈనెల 23వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలలోపు జూనియర్ కళాశాలలో సమర్పించాలని కోరారు. గతంలో గెస్ట్ ఫ్యాకల్టీగా చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీ మణి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్ఎస్‌సి, ఎనిమిదో తరగతి పాసైన విద్యార్థులు మూడో విడత అడ్మిషన్‌ల కోసం ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో 29వ తేదీన, ప్రైవేటు ఐటీఐలో 31వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 08674-295953, 82975 74757, 99851 62555కు సంప్రదించాలన్నారు.

మెగా వైద్య, రక్తదాన శిబిరం రేపు

నాగాయలంక : మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా జనసైనికుల సహకారాలతో ఈనెల 22న నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రం ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు భోగాది విష్ణువర్థన్ తెలిపారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారు. రక్తదానం చేసే దాతలు శిబిరానికి రావాలని ఆయన కోరారు. ఇండియన్‌రెడ్‌క్రాస్ సంస్థ, అను గ్రూపు హాస్పటల్ ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నామన్నారు.

సుధారాణి నేత్రదానం

నాగాయలంక : స్థానిక నాల్గో వార్డుకు చెందిన శిష్టా సుధారాణి (57) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల సహకారంతో ఆమె కళ్లను విజయవాడ ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఎల్.వి.ప్రసాద్ టెక్నీషియన్ మహేష్ వచ్చి కార్నియాను సేకరించారు. సుదర్శి మానవతా సేవా సంస్థ నుంచి ఇది 207వ నేత్రదానం.

ఒన్‌టౌన్ సీఐగా కొండపల్లి శ్రీనివాస్



గుడివాడ : గుడివాడ ఒన్‌టౌన్ సీఐగా కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వీఆర్‌లో ఉన్న శ్రీనివాస్‌ను ఒన్‌టౌన్ సీఐగా బదిలీ చేశారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన చోరగుడి

గుడివాడ : గుడివాడ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చోరగుడి రవికాంత్ మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గుడివాడ టిడ్కో లబ్ధిదారుల జాబితాలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలను, లబ్ధిదారుల పేర్ల మార్పులతో సహా అందించానని చోరగుడి తెలిపారు. టిడ్కో కాలనీలో చోటుచేసుకున్న అవినీతిపై పూర్తిస్థాయి విచారణ చేపడతానని లోకేశ్ హామీ ఇచ్చినట్లు చోరగుడి తెలిపారు.

బార్లపూడి మాజీ సర్పంచ్ కోనేరు రాజేంద్ర ప్రసాద్ కన్నుమూత



కూచిపూడి : మొవ్వ మండలం బార్లపూడి గ్రామ మాజీ సర్పంచ్ కోనేరు రాజేంద్ర ప్రసాద్ (86) అనారోగ్యంతో స్వగ్రామంలో కన్నుమూ శారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి ఆ యన భౌతికకాయాన్ని మంగళవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేంద్ర ప్రసాద్ మొవ్వ మండల రెడ్‌క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యునిగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు.

చానల్ విలేకరిపై దాడికి ఖండన

గుడివాడ : చానల్ విలేకరి వెంకట్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గుడివాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షకార్యదర్శులు గూడపాటి రాజు, మహ్మమద్ జబీవుల్లా డిమాండ్ చేశారు. ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్‌ను ఏపీయూడబ్ల్యూజే నాయకులు మంగళవారం పరామర్శించారు. చానల్ విలేకరిపై జరిగిన దాడిని ఖండించారు. గోపాలకృష్ణ, జోసఫ్(తంబి), రాజేష్, ఎల్.శ్యామ్, చంద్రశేఖర్, ఎం.ఎం ముఖర్జీ, వీర్ల శ్రీనివాస్, గౌతమ్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అవనిగడ్డ : పశువుల్లో వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. పశు సంవర్ధక శాఖ అవనిగడ్డ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డి.సాంబశివరావు అధ్యక్షతన జాతీయ పశువైద్య నియంత్రణ పథకం కింద బ్రుసెల్లోసిస్ నియంత్రణ టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలి వెంకట్రామ్, పశు వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ షఫీ, డాక్టర్ సుధారాణి, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

నాగాయలంక : టి.కొత్తపాలెం గ్రామానికి చెందిన బండ్రెడ్డి బస్వారావు (తాత) ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన జీవనోపాధి నిమిత్తం మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు (చంటి), కుమార్తె మెండు చందన రూ.10 వేలు ఇంటి వద్ద బస్వారావుకు అందజేశారు.

భారత్ బంద్ జయప్రదం చేయండి

అవనిగడ్డ/ కోడూరు : మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ దళిత సంఘాల నేతలు ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ భారత్ బంద్ నిర్వహిస్తున్నామన్నారు. వ్యాపార, విద్యాసంస్థలు, వర్తకులు, ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు సహకరించాలని కోరారు. బంద్‌కు సహకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ డెమొక్రటిక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విస్సంశెట్టి నాగరాజుకు వినతిపత్రం అందించారు. మాలమహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్, దళిత సంఘాల నేతలు బొంతు ప్రకాష్, మెరుగు రణధీర్, రాకేష్, మద్దాల దుర్గారావు, బత్తుల రాజు, వెన్నా ప్రసాద్, బత్తుల రాజ్‌కుమార్, అరవింద్, నవ భరత్ తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 21వ న చేపట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చే యాల్సిందిగా సంఘ నేతలు విజ్ఞప్తి చేశారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు బంద్‌కు సహకరించాలని మాలమహానాడు నేతలు అశోక్, శ్రీనివాసరావు, రవీంద్రబాబులు విజ్ఞప్తి చేశారు.

సారా స్థావరాలపై దాడులు

మచిలీపట్నం టౌన్ : పోలాటితిప్ప గ్రామంలో నాటుసారా స్థావరాలపై గ్రామ కమిటీ సభ్యులే దాడులు చేశారు. గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం ప్రకారం గ్రామ సర్పంచ్ మోకా రాజు ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై మంగళవారం దాడులు జరిపారు. 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా కాస్తున్న ఒక వ్యక్తి విద్యుత్ కనెక్షన్‌ను తొలగించిన సంగతి తెలిసిందే.



కోనేరుసెంటర్‌లో ర్యాలీ



చల్లపల్లిలో సీపీఐ, మహిళా సమాఖ్య అధ్వర్యంలో నిరసన

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 20 : కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచార ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కోనేరుసెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** కేంద్ర భద్రతా చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు గుత్తికొండ రాము డిమాండ్ చేశారు. కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం చల్లపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మీర్ రి జ్యాన్ మాట్లాడుతూ సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా దోషులను గుర్తించకపోవటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అట్లూరి స్వరూ ప తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా తాడిశెట్టి నరేష్ జన్మదిన వేడుక

పామర్రు : పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ జన్మదిన వేడుకలు పాలశీతల కేంద్రం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నరేష్ ఎమ్మెల్యే కుమార్‌రాజాతో కలిసి జన్మదిన కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.



సచివాలయ సిబ్బందికి సత్కారం

మచిలీపట్నం టౌన్ : కలెక్టర్ ప్రశంసలు అందుకున్న 8, 42, 49 సచివాలయాల అడ్మిన్లు ఎం.వి. దుర్గా భవానీ, నాగకుమారి, ఎన్.వి.ఎస్. మూర్తి, సిబ్బంది కూనపరెడ్డి రామశేషారావు, పుట్టి రత్నంలను టీడీపీ నేత గోపీచంద్, పి.వి. ఫణికుమార్ ఘనంగా సత్కరించారు.



గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూకే పురస్కారం

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూకే నుంచి ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాల అవార్డు లభించింది. జేఎన్‌టీయూ కాకినాడ 17వ ఆవిర్భావ దినోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ ఉత్తమ పనితీరు అవార్డు అందుకున్నారు. కళాశాల యాజమాన్యం, సిబ్బంది ఆయన అభినందించారు.

ఫార్మసీ కళాశాలకు ప్రశంసా పత్రం



గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావుకు జేఎన్‌టీయూ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కాకినాడలో జరిగిన జేఎన్‌టీయూ ఆవిర్భావ దినోత్సవంలో ప్రొఫెసర్ డాక్టర్ కె. రామ్మోహనరావు ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.



చంద్రబాబుతోనే బ్రాహ్మణులకు మేలు

మచిలీపట్నం టౌన్ : చంద్రబాబు ప్రభుత్వంలోనే బ్రాహ్మణులకు మేలు జరుగుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవం సందర్భగా మంగళవారం శిడింబి అగ్రహారంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ఆధ్వర్యంలో తెలుగుదేశం జెండా దిమ్మ వద్ద చంద్రబాబు చిత్రపటానికి గోపీచంద్‌తో పాటు రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు పివిఫణికుమార్, జిల్లా అధ్యక్షుడు సోమయాజులు రఘుశర్మ తదితరులు పాలాభిషేకం చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకువస్తుందన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు నాగసాయి శర్మ , పిశుపాటి రామశర్మ, ఎల్.కుటుంబ శాస్త్రి, ఎన్‌వీఎం కుమార శర్మ తదితరులు పాల్గొన్నారు. రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆయుష్య హోమం నిర్వహించారు.

జిల్లా నోడల్ అధికారి పాఠశాలల తనిఖీ



కోడూరు : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా నోడల్ విద్యాశాఖ అధికారి హజీ బేగ్ మంగళవారం తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీఎం పోషణ, మన బడి - మన భవిష్యత్, కిచెన్ గార్డెన్, టాయిలెట్లు, ఆట వస్తువులు, ఆట స్థలం, లాగ్వేంజ్ క్లబ్, సైన్స్ క్లబ్‌లను పరిశీలించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో టి.వి.ఎం.రామదాసు, వి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూర విద్యతో మంచి భవిష్యత్

ఘంటసాల : దూర విద్య మంచి భవిష్యత్ ఇస్తుందని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.డేవిడ్ రాజు అన్నారు. ఘంటసాల జడ్పీ హైస్కూల్ (ప్లస్)ను మంగళవారం ఆయన సందర్శించారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యావిధానం) ద్వారా పదవ తరగతి చదివేందుకు పాఠశాలలకు రాలేని వారికి, ఇంటర్మీడియట్ చదువుకునే వారికి మంచి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఘంటసాలోని జడ్పీ హైస్కూల్‌లో దూర విద్యా విధానం ద్వారా పదవ తరగతి చదివేందుకు 100 సీట్లు, ఇంటర్మీడియట్ అర్ట్స్ చదివేందుకు 40 సీట్లు ఉన్నట్లు వివరించారు. దూర విద్యా విధానం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఎంఈవోలు ఎస్.శివశంకర్, ఎండి.మోమిన్, హెచ్‌ఎం శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి ఐక్యతను కాపాడుకుందాం

గుడివాడ : నియోజకవర్గంలో కూటమి ఐక్యతను కాపాడుకుందామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. నాగవరప్పాడు సెంటర్‌లో జనసేన పార్టీ జెండా దిమ్మె ధ్వంసానికి దారం నరసింహారావు చేసిన ప్రయత్నాన్ని ఖండిస్తున్నామన్నారు. నరసింహారావుపై క్రమశిక్షణ చర్యలకు జిల్లా అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావుకు సిఫారసు చేశామన్నారు. కూటమి ఐక్యతకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, నాయకులు వాసే మురళీ, కామేపల్లి తులసీబాబు, కంచర్ల సుధాకర్, పంద్రాజు సాంబశివరావు, పట్టపు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి బాబ్జీకి సన్మానం

చల్లపల్లి : కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న చల్లపల్లి గ్రామ సచివాలయం - 2 ఎనర్జీ అసిస్టెంట్ సిహెచ్.బాబ్జీని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు, ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్ కుమార్‌లు బాబ్జీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యుత్‌శాఖ ఏఈఈ కె.అరవింద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి కె.వి.రామకృష్ణయ్య

చట్టాలపై అవగాహన ఉండాలి

పెడన రూరల్ : న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలను అందించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య పేర్కొన్నారు. పుల్లపాడు గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయం, చట్టం అంశాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉంటే ఏవిధమైన కోర్టు తగాదాలు రావన్నారు. అటువంటి సందర్భం వస్తే ఉచితంగా న్యాయసేవాధికార సంస్థద్వారా ప్రజలకు న్యాయం అందిస్తామన్నారు. సీనియర్ లాయర్లు ఎస్ సుధాకర్, సిహెచ్ మునలయ్య, ఆర్ఐ మణికుమార్, కొరెడ్ల సుశీల, జోగి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుల నుంచి రక్షణపై అవగాహన

నాగాయలంక : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్ఎఫ్ సాయంతో గ్రామాల్లో ఆర్థిక, ప్రాణ నష్టాలను నివారించుకోవచ్చునని దళాధికారి పింటు నాంది తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణ చర్యలపై గ్రామ, సచివాలయ కార్యదర్శులకు అవగాహన నిర్వహించారు. తహసీల్దార్ ఎం.హరనాథ్ బాబు, ఎంపీడీవో జె.వి.సీతారామకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగిత మామిడికోళ్ల కాల్వ పరిశీలన

పెడన : ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం గూడూరు మం డలం కంకటావ, లేళ్ళగరువు, షా అబ్దుల్లాపాలెం గ్రామాల రైతులతో కలిసి మామిడికోళ్ల కాల్వను పరిశీలించారు. కాలువకు సరైన సమ యంలో నీళ్ళు రావడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఎమ్మెల్యే ఎదుట తమ గోడు వెళ్ళబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ డీఈ, ఎస్ఈలకు ఫోన్ చేసి తక్షణమే సమస్యను పరిష్కరిం చాలని ఆదేశించారు. పోతన స్వామి, ఎన్ఏ బేగ్, పంచకర్ల సురేష్, వాకా శ్రీనివాసరావు, శీరం సంతోష్ నాయకులు పాల్గొన్నారు.

రంగమ్మ పేరంటాలు వార్షికోత్సవం



గుడివాడ రూరల్ : మోటూరులో వేంచేసి ఉన్న రంగమ్మ పేరంటాలు దేవాలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా అ మ్మవారికి విశేష అలంకరణ, కుంకుమ పూజ, గ్రామోత్సవం, ఉంజల్ సేవ నిర్వహించారు. కమిటీ సభ్యులు అందె దుర్గారావు, శివ ప్రసాద్, ఘంటా వెంకటేశ్వరరావు, చెన్నూరి పోతురాజు, శలంకాయల వెంకట సుబ్బయ్య, గ్రామ ప్రముఖులు ఘంటా బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు. పోలీసు సహకారంతో వేడుకలు ప్రశాంతంగా జరిగాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పామర్రు : వరి పంటలో సమగ్ర సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని జేడీ నూతలపాటి పద్మావతి అన్నారు. పామర్రులో జరిగిన పొలంబడిలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరిలో చీడపీడల నివారణకు సేంద్రియ విధానాన్ని అవలంభించాలన్నారు. దోమ పోటు నివారణకు తీసుకోవాల్సి చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట వివరాలు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో రైతులు నమోదు చేసుకోవాలని కోరారు. పామర్రు వ్యవసాయసహాయ సంచాలకులు స్వర్ణలత, ఏవో శివనాగరాణి,వీఏవో శ్రావణి, శేఖర్, కిరణ్ , రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ పర్యవేక్షణలో ముషారఫ్ కోసం గాలింపు

కోడూరు, ఆగస్టు 20 : హంసలదీవి బీచ్ వద్ద గల్లంతైన అబ్దుల్ ముషారఫ్ కోసం తహసీల్దార్ బి.శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. తహసీల్దార్ శ్రీను నాయక్ రెవెన్యూ సిబ్బంది, పోలీసు, మెరైన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బోటులో పాలకాయితిప్ప ప్రాంతంలో ముషారఫ్ కోసం గాలించారు. నిజాంపట్నం, గిలకలదిండి మెరైన్ పోలీసులకు విశాఖ కోస్టు గార్డు సిబ్బందికి కూడా సమాచారం అందించామని శ్రీనునాయక్ తెలిపారు.